## క్లుప్తంగా

### పోలీసు సేవలను సద్వినియోగం చేసుకోవాలి


ఎస్సై రామకృష్ణ

**కోటనందూరు:** అత్యవసర సమయాల్లో పోలీసు సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై టీ రామకృష్ణ కోరారు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాలతో మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. కోటనందూరు పోలీసుస్టేషన్ పరిధిలో ఉన్న ప్రజలంతా అత్యవసర సమయంలో తన ఫోన్ నంబరు 9440900773ను సంప్రదించవచ్చన్నారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో జరిగే దొంగతనాలు, అసాంఘిక, జూద, మాదక ద్రవ్యాల కార్యకలాపాలపై సమాచారం అందించవచ్చన్నారు. పల్లెల్లో ప్రజా రక్షణకు పగలు, రాత్రి గట్టి నిఘా ఏర్పాటు చేసామన్నారు. ఆపదలో ఉన్న ప్రజలకు పోలీసులు అన్ని వేళలా అండగా ఉంటారని చెప్పారు. సిబ్బంది పాల్గొన్నారు.

### పలు గ్రామాల్లో వైద్య శిబిరాలు


కృష్ణవరంలో పాడి రైతులకు మందులు అందజేస్తున్న సిబ్బంది

**కిర్లంపూడి:** పశు వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు షేక్ నయీమ్, వెన్నా వినోద్ అన్నారు. మండలంలోని సోమరాయణంపేట, కృష్ణవరం గ్రామాల్లో మంగళవారం పశువైద్య శిబిరాలు నిర్వహించారు. సుమారు 65 మంది పాడిరైతులకు చెందిన గేదెలు, మేకలకు, గొర్రెలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

**రౌతులపూడి:** ఈ నెల 20వ తేదీ నుంచి మండల గ్రామాల్లో ప్రారంభమైన పశువైద్య శిబిరాలు మంగళవారం పారుపాక, రాఘవపట్నం గ్రామాలతో ముగిశాయి. రౌతులపూడి క్లస్టర్‌లో పశువైద్యాధికారి ఎం.వీరాఘవరావు, ములగపూడి క్లస్టర్‌లో పశువైద్యాధికారి డాక్టర్ విభ ఆధ్వర్యంలో శిబిరాలను నిర్వహించారు. ఈ శిబిరాల్లో పశువులకు నట్టల నివారణ, వ్యాధులు సంక్రమించిన పశువులకు చికిత్సలు అందించారు.

**ప్రత్తిపాడు రూరల్:** పశువులు వ్యాధుల బారిన పడకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ ప్రత్యేక అధికారి డాక్టర్ రాధాకృష్ణ అన్నారు. పోతులూరులో మంగళవారం లేగదూడల ప్రదర్శన, పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సంవత్సరం లోపు ఉన్న 40 దూడలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో గొర్ల నూకరాజు దూడ ప్రథమ స్థానం, బుడంకాయల కొండబాబు దూడ ద్వితీయ స్థానం, రేఖా గంగాధర్ దూడ తృతీయ స్థానం కైవసం చేసుకున్నాయి. విజేతలకు అధికారుల చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. పశు వైద్య శిబిరంలో 110 పశువులకు వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ జిల్లా సంయుక్త సంచాలకుడు డాక్టర్ సూర్యప్రకాశరావు, ఉపసంచాలకులు డాక్టర్ డీబీఆర్ అంబేడ్కర్, ప్రత్తిపాడు సహాయక సంచాలకులు డాక్టర్ చిక్కం బాలచంద్ర యోగీశ్వర్, పశువైద్యాధికారులు రైతులు పాల్గొన్నారు.

### నేడు ప్రత్యంగిర హోమం

**అన్నవరం:** పుష్య అమావాస్య సందర్భంగా రత్నగిరి వనదేవత వనదుర్గ అమ్మవారికి బుధవారం ప్రత్యంగిర హోమం నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు హోమం, అనంతరం పూర్ణాహుతి నిర్వహిస్తారు. రూ.750 టికెట్టుతో భక్తులు ఈ హోమంలో పాల్గొనవచ్చునని అధికారులు తెలిపారు.

### స్వచ్ఛత వారోత్సవాలపై బైక్ ర్యాలీ

**తొండంగి:** పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు మంగళవారం స్వచ్ఛత వారోత్సవాల్లో భాగంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛదివస్‌లో భాగంగా కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు బైకులపై తీరప్రాంత గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థినులు పెరుమాళ్లపురం ప్రధాన కూడళ్ల వద్ద మానవహారంగా ఏర్పడి పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.వి.కె.మెహర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి టి.రాము, అధ్యాపకులు పాల్గొన్నారు.

### ఆస్పత్రిలో ఆరు పడకల విభాగం ప్రారంభం

**తుని రూరల్:** తేటగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరు పడకల విభాగం ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. పీహెచ్‌సీలో నూతనంగా నిర్మించిన ఆరు పడకల విభాగాన్ని మంగళవారం ప్రభుత్వ విప్ యనమల దివ్య ప్రారంభించి, రోగులను పరామర్శించారు. ఆస్పత్రి ప్రాంగణంలో కొబ్బరి మొక్కను నాటారు. ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, మాజీ సర్పంచ్ గజ్జి అప్పలరాజు, నాయకులు గజ్జి రాంబాబు, చామంతి సత్తిబాబు, కోనా కన్నారావు, చిరంజీవిరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### ఎక్సైజ్ దాడులు

**ప్రత్తిపాడు:** స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని ఏలేశ్వరం మండలం అప్పనపాలెంలో మంగళవారం ఎక్సైజ్ సిబ్బంది దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ కథనం ప్రకారం.. అప్పనపాలెం గ్రామ సమీపంలోని సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన సుమారు 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై పున్నం వంశీరామ్ తదితర సిబ్బంది పాల్గొన్నారని సీఐ తెలిపారు.

# ప్రజలకు అమృతం

- అమృత్ పథకంతో ప్రజలకు తాగునీరు
- వేసవిలోనూ పుష్కలంగా మంచినీరు
- ఏటా నీటి పన్ను ఆదాయం రూ.90 లక్షలు
- నిర్వహణ వ్యయం రూ.90 లక్షలు
- అమృత్-2 పథకంలో రూ.9.50 కోట్ల ప్రతిపాదనలు


తుని పట్టణం బొడవ తోటలో నీరు నిల్వ చేసే మెగా రిజర్వాయరు

**తుని:** మనిషికి గాలి, నీరు, నీడ అత్యంత అవసరం . వీటిలో నీరు మనం బతకడానికి ఎక్కువగా సహకరిస్తుంది. దీంతో అధికారులు ప్రజలకు తాగునీటిని అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. పురపాలక సంఘంలో తాగునీటి కష్టాలు లేకుండా చేపట్టిన చర్యలు మంచి ఫలితాలే ఇచ్చాయి. ప్రస్తుత జనాభాకు అనుగణంగా రోజుకు 7.15 ఎంఎల్‌డీ(మిలియన్ లీటర్ ఫర్ డే) అవసరం కాగా ప్రస్తుతం రోజుకు 6.15 ఎంఎల్‌డీ నీటిని అందిస్తున్నారు. సగటున మనిషికి రోజుకు 135 లీటర్లకు గాను 115 లీటర్లు సరఫరా చేస్తున్నారు. నూరు శాతం నీటిని అందించడానికి ఎంఎల్‌డీ నీటిని అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇకపై నీటి కొరత కనిపించదు. ఇందులో భాగంగా ప్రభుత్వానికి అమృత్-2 పథకానికి రూ.9.50 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. త్వరలో ప్రభుత్వ అనుమతులు వస్తాయని, దీంతో రెండు మెగా రిజర్వాయర్లు, పంపు హౌస్, అదనపు పైపులైన్ల నిర్మాణం చేపట్టనున్నారు. ఇది నాలుగేళ్ల పాటు దశల వారీగా చేస్తామని కమిషనర్ వెంకట్రావు తెలిపారు.

**ఇదీ పరిస్థితి**

పట్టణం 7.02 చదరపు కిలోమీటర్లు విస్తీర్ణంలో ఉంది. 54,925 మంది జనాభా ఉన్నారు. 30 వార్డుల పరిధిలో 14 వేల కుటుంబాలు ఉన్నాయి. వీరందరికీ ప్రస్తుతం 6.15 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేస్తున్నారు. సగటున మనిషికి రోజుకు 135 లీటర్ల నీరు అవసరం కాగా 115 లీటర్లు అందిస్తున్నారు. డ్రైవర్స్‌కాలనీ, బొడవతోట ప్రాంతాలకు మాత్రం వేసవిలో నీటి ఇబ్బందులు ఉన్నాయి. దీన్ని అధిగమించేందుకు సమ్మర్ ప్లాన్‌లో రూ.3.50 లక్షల నిధులు కేటాయించారు. రెండు ప్రాంతాలకు రెండు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. రేఖవానిపాలెం, కణ్ణాళ్లకొండ, రాజీవ్‌గృహకల్ప, మార్కెట్, నుకాలమ్మ గుడి, నామగిరి వీధి, రామకృష్ణాకాలనీ, తదితర ప్రాంతాల్లో పంపు హౌస్‌లు ఉన్నాయి. ఆర్టీసీ కాంప్లెక్సు వెనుక, బొడవతోట, మార్కండ్రాజుపేట తదితర ప్రాంతాల్లో 6.15 ఎంఎల్‌డీ నీటిని నిల్వ చేసే రిజర్వాయర్లు ఉన్నాయి. ప్రతి పంపు హౌస్ దగ్గర క్లోరినేషన్ పాయింట్లు ఏర్పాటు చేశారు. ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందిస్తున్నారు.

**తుని పురపాలకసంఘం**

గ్రేడు -2

| | |
|---|---|
| విస్తీర్ణం: | 7.02 చదరపు కిలోమీటర్లు |
| జనాభా : | 54,925 |
| కుటుంబాలు: | 14,000 |
| పైపులైన్ పొడవు: | 74.33 కిలోమీటర్లు |
| పంపింగ్ మెయిన్ లైన్: | 1.80 కిలోమీటర్లు |
| నీటి నిల్వ చేసే రిజర్వాయర్లు: | 11 |
| పవర్ బోర్లు : | 09 |
| చేతి పంపులు: | 214 |
| ఇంటి కుళాయిలు: | 5,549 |
| వీధి కుళాయిలు: | 317 |
| నీరు డిమాండ్: | 7.15 ఎంఎల్‌డీ |
| ప్రస్తుతం సరఫరా: | 6.15 ఎంఎల్‌డీ |
| మనిషికి రోజుకు సరఫరా చేయాల్సింది: | 135 లీటర్లు |
| ప్రస్తుత సరఫరా చేస్తుంది: | 115 లీటర్లు |
| నీటి పన్ను ఆదాయం: | 90 లక్షలు(ఏడాదికి) |
| నిర్వహణ వ్యయం: | 90 లక్షలు(ఏడాదికి) |

**అమృత్-2 పథకం ప్రతిపాదనలు**

**నాలుగేళ్లలో రూ.9.30 కోట్ల వ్యయం**

| | |
|---|---|
| నిర్మాణాలు: | రెండు రిజర్వాయర్లు, పంపుహౌస్, పైపులైన్లు విస్తరణ |

**ఆదాయ, వ్యయం సమానం**

మున్సిపాలిటీకి నీటి పన్ను ద్వారా ఏటా రూ.90 లక్షల ఆదాయం వస్తోంది. విద్యుత్ బిల్లులు, నిర్వహణకు రూ.90 లక్షలు అవుతుంది. ఇది కేవలం డొమిస్టిక్ విభాగంలో వస్తున్న ఆదాయం. కమర్షియల్ కేటగిరిలో ఉన్న హోటళ్లు, ఫంక్షన్ హాల్స్, ఆసుపత్రులు తదితర వాటి నుంచి వస్తున్న ఆదాయం నామమాత్రమే. వీటికి మీటర్లు ఏర్పాటు చేస్తే వినియోగం ఆధారంగా అదనపు ఆదాయం సమకూరే అవకాశం ఉంది. ఈ దిశగా అధికారులు కసరత్తు చేయాలని ప్రజలు సూచిస్తున్నారు.

**అమృత్-2తో సమస్య పరిష్కారం**



పట్టణంలో నీటి సమస్య లేకుండా ఉండేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమృత్-2 పథకం ఉపయోగ పడుతుంది. నాలుగేళ్ల పాటు పథకం పనులు కొనసాగుతాయి. రూ.9.50 కోట్లు నిధులు రానున్నాయి. వీటితో రెండు మెగా రిజర్వాయిర్లు, పంపు హౌస్, అదనపు పైపు లైన్ల నిర్మాణం చేపడతాం. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాం. త్వరలో అనుమతులు రానున్నాయి. దీంతో కొరత ఉన్న ఒక ఎంఎల్‌డి నీరు అందుబాటులోకి వస్తుంది.

– వెంకట్రావు, కమిషనర్, తుని

**పుష్కలంగా తాగునీరు**



పట్టణంలోని అన్ని ప్రాంతాలకు పుష్కలంగా తాగునీరు అందిస్తున్నాం. అమృత్-2 పథకంలో వచ్చిన నిధులతో అవసరమైన రిజర్వాయర్లు, పైపులైన్ల నిర్మాణం పనులు జరుగుతున్నాయి. వేసవిలో సైతం పూర్తి స్థాయిలో నీటిని అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం.

– ఏలూరి సుధారాణి, సీపీ, తుని

### ముద్రగడను కలిసిన యనమల కృష్ణుడు


ముద్రగడను కలిసిన వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడు

**కిర్లంపూడి:** తుని నియోజకర్గం వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడు మంగళవారం కిర్లంపూడిలో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభంను, వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గం ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబును మర్యాద పూర్వకంగా కలిశారు. వారిని కలిసిన వారిలో ఏలేశ్వరం మండలం రమణయ్యపేట గ్రామ సర్పంచ్ సభ్యుడు ములగపాటి రమేష్‌రాజు ఆధ్వర్యంలో ఉపసర్పంచ్ సుపర్తి లక్ష్మణదొర, విద్యాకమిటీ మాజీ చైర్మన్ దూసరి అబ్బాయి, తాడాల అప్పారావు దొర, అల్లూరి శివకృష్ణవర ప్రసాద్‌రాజు, టెంకె లవకుశ తదితరులు ఉన్నారు.

### ఉపాధి హామీ సిబ్బంది సమీక్ష

**గండేపల్లి:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న క్షేత్ర సహాయకులకు, ఫీల్డ్ అసిస్టెట్లకు మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ పథకంలో చేపట్టబోయే ప్రాధాన్యత గల పనులు, ఉపాధి హామీ చట్టం ప్రధాన అంశాలు, లేబర్ రిపోర్టు టార్గెట్‌కు అనుగుణంగా లేబర్ రిపోర్ట్ పెంచాలని, పనులు అందుబాటులో ఉంచుకోవాలని తదితర అంశాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ ఆర్ గంగాభవాని తదితర సిబ్బంది పాల్గొన్నారు. అలాగే స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ, ఆర్‌డబ్ల్యూస్, ఇంజినీరింగ్ అధికారులతో పంచాయతీరాజ్ కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించినట్టు ఎంపీడీఓ నాతి బుజ్జి తెలిపారు. స్వచ్ఛత గ్రామాలు, మరుగుదొడ్లు, చెత్త నుంచి సంపద కేంద్రాలు, వేల మంది జనాభా ఉన్న గ్రామాల్లో మూడు కమ్యూనిటీ సోక్ పిట్స్ ఉండాలని సూచించినట్టు తెలిపారు.

### జగపతినగరంలో అన్నసమారాధన

**కిర్లంపూడి:** జగపతినగరం గ్రామ శివారున వేంచేసి ఉన్న సత్తెమ్మతల్లి అమ్మవారి ప్రాంగణం వద్ద మంగళవారం ఘనంగా అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

## చెరువుకు పోలవరం కాలువ నీరు


పోలవరం ఎడమ ప్రధాన కాలువలో నీటిని తీసి వేసేందుకు పొక్లెయిన్‌తో ట్రెంచ్ తవ్వుతున్న కాంట్రాక్ట్ సిబ్బంది


ట్రెంచ్ తవ్వడంతో రాజు చెరువుకు చేరుతున్న పోలవరం ఎడమ ప్రధాన కాలువ నీరు

**తుని రూరల్:** పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులు పునఃప్రారంభించేందుకు అనువుగా కాలువలో ఉన్న నీటిని వి.కొత్తూరు రాజు చెరువుకు మళ్లించే ప్రక్రియ చేపట్టారు. అందులో భాగంగా మంగళవారం లోవకొత్తూరు సమీపంలో పోలవరం కాలువకు ట్రెంచ్ తవ్వి కాలువలో నిల్వ ఉన్న నీటిని రాజు చెరువుకు మళ్లించారు. ఈ కాలువలో ఇప్పటికే పది అడుగుల ఎత్తు మేరకు నీటి నిల్వలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో కాలువపై బ్రిడ్జి నిర్మాణ పూర్తయినప్పటికి బ్రిడ్జి దిగువ నుంచి వి.కొత్తూరు వరకు కాలువ తవ్వకం, సీసీ లైనింగ్ పనులు చేయాల్సి ఉంది. నీరు మళ్లించిన తర్వాత ఈ పనులు చేపట్టనున్నట్టు డీఈ మురళీకృష్ణ తెలిపారు. గతంలో షబీర్ డ్యాం, పీఎస్‌కే సంస్థలు ఈ పనులు చేశాయి. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఇటీవల కాంట్రాక్టు సంస్థను మార్చారు. ప్రస్తుతం ఈ పనులను ఆర్‌వీఆర్ సంస్థ చేపట్టింది.

## మంద కృష్ణమాదిగకు మద్దతుగా ర్యాలీ


తుని గొల్ల అప్పారావు సెంటర్లో మంద కృష్ణమాదిగ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

**తుని:** మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకులు మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో వచ్చే నెల 7వ తేదీన హైదారబాద్‌లో నిర్వహించనున్న లక్షడప్పులు, వెయ్యి గొంతులు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి గోదావరి జిల్లాల అధ్యక్షుడు ముప్పిడి శ్యామ్‌కుమార్ మాదిగ కోరారు. మంగళవారం తుని ఎల్ఐసీ సెంటర్ నుంచి గొల్ల అప్పారావు సెంటర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. మందా కృష్ణమాదిగకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డుకు ఎంపిక చేసిన సందర్భంగా ఆయన చిత్ర పటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా గొల్ల అప్పారావు సెంటర్లో జరిగిన కార్యక్రమంలో శ్యామ్‌కుమార్ మాదిగ మాట్లాడుతూ హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమానికి మాదిగ ఉద్యోగ సంఘాలు, నాయకులు, లాయర్లు, విద్యార్థి సంఘాలతోపాటు గ్రామాల నుంచి భారీ ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కాకడ నూకరాజు, కాకినాడ జిల్లా అధ్యక్షుడు అనంత రాజు, సత్తిబాబు, వెంకటరమణ, ఎం.డేవిడ్ రాజు, రమణ, ఏసుబాబు, కింతాడ సత్తిబాబు, జుత్తుక మరళీ, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

### ముగిసిన గీతాజ్ఞానయజ్ఞం

**అన్నవరం:** రత్నగిరి సత్యదేవ సన్నిధిన గత మూడు రోజులుగా జరుగుతున్న గీతాజ్ఞానయజ్ఞం మంగళవారంతో ముగిసింది. సామర్లకోట మండలం జీ మేడపాడుకు చెందిన శంకరానంద స్వామి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక వేత్తలు, భజన బృందాల సభ్యులు, మహిళలు భగవద్గీత పారాయణ చేశారు.

## మోటార్ కేబుళ్ల దొంగను పట్టుకున్న రైతులు

**మరో ఇద్దరు పరారీ**

**గండేపల్లి:** మోటార్ కేబుళ్లను చోరీకి పాల్పడిన దొంగను గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించినట్టు రైతులు తెలిపారు. సోమవారం రాత్రి జరిగిన సంఘటనపై గ్రామస్తుల వివరాల ప్రకారం.. పి.నాయకంపల్లి నుంచి జెడ్ రాగంపేట వెళ్లే మార్గంలో పొలాల వద్ద మోటారు సైకిల్‌పై అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తిని అదే మార్గంలో వస్తున్న రైతులు గమనించి నిలదీయడంతో అప్పటికే పొలంలో మోటార్ కేబుల్స్ కట్ట చేయడానికి ప్రయత్నిస్తున్న మరో ఇద్దరు అక్కడ నుంచి పరారయ్యారు. దీంతో మోటారు సైకిల్‌తో ఉన్న ఆ వ్యక్తిని గ్రామంలోకి తీసుకువచ్చి గండేపల్లి పోలీసులకు అందజేశారు. ఆ దుండగుడిని స్టేషన్‌కు తరలించారు. ఆ చోదకుడు వద్ద మోటార్ సైకిల్‌కు బ్యాగ్‌లో అంతకు ముందు చోరీ చేసిన వైర్లు, చోరీకి ఉపయోగపడే పనిముట్టు ఉన్నట్టు పేర్కొన్నారు.

## రూ.4.05 కోట్లతో లోవ అభివృద్ధి పనులు

**నాలుగు ఎస్కలేటర్లు, రాతి మెట్ల పనులు**


రూ.4.05 కోట్ల పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ దివ్య

**తుని రూరల్:** జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రం తలుపులమ్మ అమ్మవారి లోవదేవస్థానంలో రూ.4.05 కోట్లతో అభివృద్ధి పనులకు ప్రభుత్వ విప్ యనమల దివ్య శంకుస్థాపనలు చేసి శిలా ఫలకాలను ఆవిష్కరించారు. మంగళవారం ఇన్‌చార్జి డిప్యూటీ కమిషన్, కార్యనిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు, ధర్మకర్తల ఆధ్వర్యంలో 3.65 కోట్ల నిధులతో భక్తుల సౌకర్యార్థం నాలుగు ఎస్కలేటర్లు ఏర్పాటు, రూ.40 లక్షలతో రాజగోపురం ఎదుట రాతి మెట్ల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన ప్రభుత్వ విప్ అమ్మవారి పంచలోహ విగ్రహాలకు 108 మంది ముత్తైదువులు తీసుకువచ్చిన సుగంధ ద్రవ్యాలు, పవిత్ర జలాలతో అభిషేకించారు. అమ్మవారిని దర్శించుకున్న దివ్య దంపతులకు వేదపండితులు వేదాశీస్సులు అందజేశారు. చైర్మన్ గొర్లి అచ్చియ్య నాయుడు, మాజీ చైర్మన్ దూలం మాణిక్యం, నాయకులు యనమల రాజేష్, సుర్ల లోవరాజు, చింతంనీడి నాగ సోమరాజు, మోతుకూరి వెంకటేష్ పాల్గొన్నారు.

## దేవదాయ శాఖ ప్రముఖులను కలిసిన ఈఓ


కమిషనర్ రామచంద్రమోహన్‌ను కలిసి స్వామివారి చిత్రపటం ఇచ్చి అభినందించిన ఈఓ వీర్ల సుబ్బారావు, ఇతర అధికారులు

**అన్నవరం:** దేవదాయ, ధర్మదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, సెక్రటరీ వాడ్రేవు వినయ్‌చంద్, నూతన కమిషనర్ కే రామచంద్రమోహన్‌ను అన్నవరం దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వేదపండితులు వారికి వేదాశీస్సులు అందజేసి స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. అదే విధంగా పాత కమిషనర్ ఎస్.సత్యనారాయణ వీడ్కోలు సభలో కూడా ఈఓ పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసినట్టు దేవస్థానం అధికారులు తెలిపారు.

**కమిషనర్‌కు అభినందనలు**

అన్నవరం దేవస్థానం వ్రత పురోహిత సంఘం మాజీ అధ్యక్షులు నాగాభట్ల రవిశర్మ, కర్రి సూర్యనారాయణ(నాని), విశ్రాంత పురోహితులు కృష్ణ భగవాన్‌జీ, వ్రత పురోహితులు మహేంద్రవాడ జగదీష్, సవితాల వీరబాబు తదితరులు నూతన కమిషనర్ కే రామచంద్రమోహన్‌ను కలిసి అభినందనలు తెలియజేశారు.

## నమ్మించి మోసం చేయడం చంద్రబాబు నైజం


జిల్లా బూత్ కమిటీల అధ్యక్షుడు ఒమ్మి రఘురాం.

**జగ్గంపేట:** ప్రజలను ఏ మార్చడం, వారిని మభ్య పెట్టడం, నమ్మించి మోసం చేయడం చంద్రబాబుకు అలవాటైన పనేనని వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా బూత్ కమిటీల అధ్యక్షుడు ఒమ్మి రఘురాం అన్నారు. మంగళవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ అధికారం దక్కించుకునేందుకు ప్రజలకు అబద్ధాలు చెప్పి అమలు చేయలేని హామీలిచ్చి ఓట్లు వేయించుకున్నారన్నారు. హామీలు అమలు పరిచే సమయం వచ్చినప్పుడు ఆర్థిక పరిస్థితి బాలేదని చేతులెత్తేయడం చంద్రబాబుకు పరిపాటేనన్నారు. 2014 ఎన్నికల్లో హామీలు తుంగలోకి తొక్కిన చంద్రబాబుని ప్రజలు నమ్మకపోయేసరికి నమ్మించే ప్రయత్నం పవన్ కల్యాణ్‌ను తీసుకుని అదే పనిగా సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ అంటూ ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ పథకాలు అమలుపై బాధ్యత తీసుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకుంటారన్నారు. పేదలకు మేలు చేయాలంటే మనసున్న నాయకుడు కావాలని, అలాంటి నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డినని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా అరాచక పాలన రాజ్యమేలుతోందని, శాంతి భద్రతలు కానరావడంలేదన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేట్ పరం చేయడం ఇప్పటికి జరుగుతుందని, ప్యాకేజీ ప్రకటించడం ఒక నాటకమేనని అన్నారు. లక్షలాది వలంటీర్లు వీధిన పడ్డారని, ప్రజలు అన్ని గమనిస్తున్నారని, ఎప్పుడు ఎన్నికలు జరిగినా తగిన గుణపాఠం చెపుతారన్నారు.

## మహిళ అదృశ్యం

**తుని:** రైలులో ప్రయాణిస్తూ మహిళ అదృశ్యమైన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ జీ మోహన్‌రావు తెలిపారు. వివరాల్లోకెళితే.. సామర్లకోట భాస్కర్ కాలనీకి చెందిన గుర్ర నూకరత్నం(49) సంక్రాంతికి పాయకరావుపేటలో అమ్మగారి ఇంటికి వచ్చింది. తిరుగు ప్రయాణంలో భాగంగా మంగళవారం స్థానిక రైల్వే స్టేషన్‌లో రత్నాచల్ ట్రైన్ ఎక్కి అదృశ్యమైంది. ఆమె ఆచూకీ దొరకకపోవడంతో నూకరత్నం తమ్ముడు పెద్దిరెడ్డి ఏసుబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు రైల్వే పోలీసులు తెలిపారు.

## సస్యరక్షణతో అపరాల సాగులో అధిక దిగుబడి


హంసవరం-2 పరిధిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ బుల్లిబాబు, ఏఓ అశోక్‌కుమార్

తుని రూరల్: అపరాల సాగులో సకాలంలో తెగుళ్లను గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడి లభిస్తుందని వ్యవసాయ సహాయ సంచాలకులు సుంకర బుల్లిబాబు అన్నారు. తుని మండలం హంసవరం-2, టి.వెంకటాపురం రైతు సేవా కేంద్రాల పరిధి ఏఓ బి.అశోక్ కుమార్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏడీఏ బుల్లిబాబు రైతులతో కలసి క్షేత్రస్థాయిలో అపరాల పంటలను పరిశీలించి, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ అనంతరం తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందేందుకు రైతులు అపరాలు సాగు చేయడం ఉత్తమం అన్నారు. ఎకరాకు 12 నుంచి 16 కిలోలు విత్తనాలు వేసుకుంటే మంచి దిగుబడులు వస్తాయన్నారు. తెగుళ్ల నివారణకు క్షేత్రస్థాయి అధికారులు సూచించిన మోతాదులో మందులు వినియోగించాలన్నారు. అధికంగా మందులు పిచికారి చేయడం వల్ల పెట్టుబడి పెరుగుతుందే తప్పా ప్రయోజనం ఉండదన్నారు. సస్యరక్షణ చర్యలతో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చన్నారు. ఏఈఓ పి.జగ్గ అప్పారావు, వీపీఏలు రాజా, సుదీర్, భవానీ, రైతులు పాల్గొన్నారు.

**గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'**

గండేపల్లి: 80 శాతం రాయితీపై రైతు సంఘాలకు కిసాన్ డ్రోన్స్ అందజేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఏఓ సద్గురుమూర్తి తెలిపారు. మండలంలోని యల్లమిల్లి, గండేపల్లిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీహెచ్ఏ ఉదయ్, వీఏఏ అంజలి, రైతులు యలమాటి కాశి, పెనుమర్తి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

**ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు**

**శంఖవరం:** ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులందరూ పంటలు సాగు చేయడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని వ్యవసాయాధికారి పి.గాంధీ, ఉద్యాన శాఖాధికారి అరుణ్‌కుమార్ అన్నారు. మండలంలోని కొంతంగి, నెల్లిపూడి గ్రామాల్లో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించి రైతులతో సమావేశమయ్యారు. రైతులకు పలు సూచనలు చేశారు.

**ఎరువులు, పురుగు మందుల యాజమాన్యం కీలకం**

**కోటనందూరు:** అపరాల సాగులో ఎరువులు, పురుగుమందుల యాజమాన్యం కీలకమని మండల వ్యవసాయాధికారి కేజే చంద్రశేఖర్ అన్నారు. కేఏ మల్లవరంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ నేల స్వభావాన్ని బట్టి పంట ఎదుగుదల ఉంటుందన్నారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు, పురుగుమందులు వినియోగిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. డ్రోన్ స్ప్రేయర్లతో కలిగే ప్రయోజనం, వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం అపరాల పంటను పరిశీలించి ఎరువులు, పురుగుమందుల యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ కేవీ శివకుమారి, వీఆర్వో రాజాశంకర్, వీఏఏ జీ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## అంబేడ్కర్‌కు గౌరవమర్యాదలిచ్చిన ఏకైక పార్టీ బీజేపీ

**బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు**


అన్నవరంలో ప్రసంగిస్తున్న జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు

**అన్నవరం:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు గౌరవ మర్యాదలు ఇచ్చిన ఏకైక పార్టీ భారతీయ జనతా పార్టీ మాత్రమేనని ఆ పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు అన్నారు. మంగళవారం అన్నవరంలో జరిగిన సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. బీజేపీ శ్రేణులు భారత రాజ్యాంగాన్ని భగవద్గీతగా భావిస్తారని, 1952 ఎన్నికల్లో బీఆర్ అంబేడ్కర్‌ను కాంగ్రెస్ పెద్దలు కుయక్తితో ఓడించిన సంగతి మరవకూడదన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు పైడా కృష్ణమోహన్, వై.మాలకొండయ్య, సంగిలిదేవి సత్తిరాజు, చలికి వీరేంద్ర, కామర్సు చిరంజీవి, గౌతు చిన్నా తదితరులు పాల్గొన్నారు.

**పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి**

**తుని:** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు అన్నారు. మంగళవారం తుని పట్టణశాఖ అధ్యక్షుడు కాదంబర రామకృష్ణ అధ్యక్షతన తునిలో సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా విశ్వేశ్వరరావును పార్టీ తుని నియోజకవర్గం నాయకులు ఘనంగా సత్కరించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా మాజీ అధ్యక్షుడు ఎనిమిరెడ్డి మాలకొండయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శులు గండి కొండలరావు, దాట్ల సూర్యనారాయణరాజు, వెలుగుల గోపాలకృష్ణ, ఆకెళ్ల శాస్త్రి, చిరంజీవరావు, బి.ధనలక్ష్మి, ప్రగడ చక్రరావు పాల్గొన్నారు.